


—మారేమండ సీతారామయ్య

కుట్టి ఓ కథానాయికి అవుతుందని, కుట్టిమీద ఓ కథ వ్రాయవలసి వస్తుందని, కథ వ్రాస్తానని నేను కలలో నైనా అనుకోలేదు సరికదా, కళ్లు తెరుచుకుని పట్టపగలు చన్పేంత వెలుతురు అనుభవించేటప్పుడైనా ఊహించలేక పోయాను. కథానాయకిని పరిచయం చెయ్యకుండా కథని పాఠకులు చెవుల్లో దూది పెట్టుకున్నా వినిపించేలా మనవి చేసేయటం చట్టరీత్యా నేరం. మానవత్వ స్థాయిలో ఆలోచిస్తే ఘోరం. మరో అడుగు ముందుకేస్తే పాపం. పాపం మూట కట్టుకోకూడదని అభిప్రాయపడే ఈరచయిత కుట్టిని మీముందుంచుతున్నాడు. కుట్టి ఖరీదైన మనుషులు పెంచుకునే కుక్కపిల్ల—కాదు. కొత్తగా ప్రేమలో పడ్డ ఉంగరాల జుత్తు అబ్బాయి ఆరాధించే ముద్దబంతి పువ్వులాటి జవ్వని ముద్దుపేరు కాదు. తెనాలి రామలింగని కాలంలో అతనితో సమానంగా వెలిగి చరిత్ర పుటలకు పాకని ఏ చిత్తూరు సీతామహాలక్ష్మిలాంటి పుట్టిలో మాణిక్యమో కాదు. అందంతోపాటు అన్నీ ఉన్నా, అందరి అవసరాలు తీర్చ నిరాకరించి నిరాదరించబడ్డ ఏ తెరమరుగు తారో కాదు. సాక్షాత్తు మా మామ కూతురు. అమ్మ మేనకోడలు. అత్త కన్న ఆఖరు గారాలపట్టి. వెరసి నాకు సొంత మరదలు. మరద లనగానే మీ కళ్లలో గులాబీరంగు ప్రింటు చీరెకు మాచయ్యే బ్లౌజుతో, జడలో పట్టినన్ని మల్లెపువ్వులు పెట్టుకుని, మెరిసే పెద్ద పెద్ద కళ్లతో ఛెంగున గెంతే ఓ హరిణాక్షి మెదిలితే, ఈ రచయిత క్షంతవ్యుడు. మా కుట్టి ఇంకా పింకెల్లో పట్టుచీరెలు కట్టే పెంకిపిల్ల కాదు. రంగు ప్రింటు చీరెలు కాదు కదా, ప్లెయిన్ పరికిణీలుకూడా వేసుకునే ఈడుది కాదు. ఒక్క ముక్కలో ఒప్పేసుకోవాలంటే 'బాబీ గాను'తో ఊరంతా తిరిగినా ప్రమాదంలేని బాలిక. మొన్ననే కాన్వెంటు థర్డ్‌స్టాండర్డు ఆనర్స్ క్లాసు సెకండ్ టెర్మ్‌కు ఫీజు కట్టి, నలభై ఒక్క వాటాల మా బిల్డింగులో త్రీ ఫోర్ జీ ట్వెంటీత్రీ అని టేబుల్స్ రుబ్బుతున్న చాకు. ఇంత చరిత్రగల కుట్టి ఈ కథకు టాప్ కారెక్టర్ ఎలా అయిందో చెప్పక పాఠకుల్ని మోహమాటంలో పెట్టినందువల్ల ఇప్పుడు ప్రయోజనం ఉండదు గాని, అనక ఓ ఏభై రూపాయల చెక్కు అందుకునే భాగ్యం ఈ జర్నలిస్టుకు ఉండదు. డబ్బుల్!

* * *

ఆదివారం రోజున మా బిల్డింగులో పిల్లల సందడి ప్రపంచపు మారుమూల పల్లెటూళ్లలో జరిగే ఏ చేపలసంతకూ తీసిపోదు. రామాయణపు కిష్కింధ కాండ ప్రత్యక్షస్వరూపం 'పిక్చర్' కొత్తైంటికెట్టు మీద చూడచ్చు. అందులో వాలి సుగ్రీవు లుంటారు. జాంబవతి, హనుమంతు ళ్లుంటారు. కలగలుపుపురాణంలోకనిపించే గరుత్మంతుళ్లు, శేషశాయిలు, గణపతి బప్పలు ప్రత్యక్షం కావటం కద్దు. అందులో మా కుట్టిని మీ రెవరితో పోల్చినా నా కభ్యంతరం అంతగా లేదు గాని, నేను ముద్దుగా 'శూర్పణఖ' అని బారసాల చేశాను. ఆదివారం నాయకత్వం మా శూర్పణఖది. ఆమె ఆధ్వర్యంలో మాబిల్డింగుపిల్లలు, నేటినాయకులుపార్టీలను అంటి పెట్టుకునే రీతిలోకాకుండా, ఒకే తాటిమీద గొప్ప స్థాయిలో ప్రదర్శనలు జరుపుతారు. అటువంటి ప్రదర్శనే జరుగుతూంది బయట ఆట పేరు 'లండన్'. బొంబాయి రాష్ట్రం నాసిక్‌త్రయంబకంలో పుట్టి, ఆంధ్రదేశపు అంచులను తాకే గోదావరిలా ఆ ఆట కాన్వెంటు స్థాయిలో పుట్టి 'దుంపల బడి'దాకా పాకింది. ఆట మంచి పట్టులో ఉంది. 'ఎల్—ఒ—ఎన్—డి—ఒ—ఎన్—లండన్' అని అరిచి, దూరంగా గమ్యస్థానం (తల్లి)లో నించున్న ఓ పిల్ల చటుక్కున వెనక్కి తిరిగింది. అంతే! గమ్యస్థానం చేరవలసిన పిల్లలు శిలల్లా బిగిసిపోయారు. రాజేష్ ఖన్నా పోజులో కొందరు, రేలంగి నోరు తెరిచి మెక్లిన్ టూత్‌పేస్టు అడ్వర్‌టైజ్‌మెంటుకు ఫోటో తీస్తే ఎలా ఉంటాడో ఆ పోజులో కొందరు, పదవీచ్యుతుడై తిరుగుముఖం పట్టే రాజకీయవేత్త పోజులో కొందరు, భామనురా నే సత్యభామనురా పోజులో కొందరు చూడముచ్చటగా ఉన్నారు. ఎవరూ కదలటం లేదు. ఎగిసి వచ్చే నవ్వుతెరలను వెలికురికే నిశ్వాసంతో కలేసి ఆపుతున్నారు. కళ్లు గుండ్రంగా తిప్పి దొంగను గమనిస్తున్నారు. దొంగ ఒక్కొక్కళ్లని సమీపించి వాళ్లని మాట లతో కదల్చటానికి విఫల ప్రయత్నం చేస్తూంది. పావు గంట గడిచింది. ఎవ్వరూ కదలలేదు. ఆ పిల్లకి ఉక్రోషం పెరిగిపోయింది.

'మీ రెవరూ కదలకపోతే నేను ఏడుస్తాను. ఎవరన్నా కదలండి' అని అరిచింది. ఎవ్వరూ వినిపించుకోలేదు.

ఎర్రబడ్డ మొహంతో, వర్షించబోతున్న కళ్లతో, 'ఎంతసేపు నే నొక్కర్తినే దొంగ పెట్టడం? ఎవరన్నా కదలండి' అని మళ్లీ అరిచింది.

ఉహూఁ! ఎవరూ పిసరంత కూడా కదల్లేదు.

'ఏమ్, కుట్టీ! కొంచెం కదలవే. నే నెవర్నీ అవుట్ చెయ్యలేకపోతున్నాను.' కుట్టి దగ్గరి కొచ్చి అడిగిం దా పిల్ల.

శూర్పణఖ చాలా ఘటికురాలు. అంత తేలిగ్గా లొంగే రకం కాదు.

'అరిగిపోతా వేమిటే? మొన్న నీకు మినపసున్ను పెట్టలేదూ? మరేమో మా నాన్న నీలంరంగు పెన్సిల్ తెస్తాడు. నీకు ఇస్తాను. కొంచెం కదలవే.' పాత

పిల్లల ఆటపాటలలో అంతలో కొట్టుకొని మరింతలో స్నేహం కట్టడం పరిపాటి. పాపల పేచీలలో పెద్దవాళ్లు తలదూర్చి కక్షలు పెంచుకొని పేచీలకి దిగడం, పట్టింపులు వదలక పోవడం-తిరిగి ఆడుకొనే ఆ పసిపాపలను చూసైనా వారిలో మార్పు రావాలి. పాపలలోని స్నేహభావాన్ని చూసైనా మారనివాళ్లను ఏమనాలి?

స్నేహాన్ని గుర్తు చేసి తాయిలం ఎర చూపింది ఆ పిల్ల.

శూర్పణఖ కదల్లేదు.

ఇంతలో కొందరు పిల్లలు చడీ చప్పుడూ లేకుండా పరుగు పరుగున తల్లిని చేరుకున్నారు.

ఆ పిల్లకు ఏడుపొచ్చేసింది. చుట్టూ చూసింది. తల్లిని చేరిన పిల్లలు వెక్కిరింతగా నవ్వుతున్నారు. తల్లిని చేరవలసిన పిల్లలు శిలల్లా బిగిసిపోయారు. కుట్టి పట్టుదలతో ప్రపంచాన్ని మరిచిపోయింది. ఏమనుకుందో ఏమో, హఠాత్తుగా ఆ పిల్ల మా కుట్టిని లాగి దవడ పేలేలా లెంపకాయ కొట్టి వాళ్ల వాటాలోకి పరుగెత్తటం మొదలుపెట్టింది. నే నూహించని పరిణామం ఇది. మా కుట్టి ఏడుపు లంకించుకుంది. నాకు చాలా కోపం వచ్చింది. అంత గట్టిగా కొడుతుందా? వెంటనే నేను ఇంట్లోకి పరుగెడుతున్న ఆ పిల్ల చెయ్యి పట్టుకుని నిలేశాను. ఆ పిల్ల పేరు సుమ. వాళ్ల నాన్న అంటే నాకు అసూయ. ఆ తండ్రి పోలికలే ఈ కూతురికి వచ్చాయి.

'మా కుట్టిని అనవసరంగా ఎందుకు కొట్టావు? ఆడటం రాకపోతే మానెయ్యాలి కాని కొడతావా? నీకు ఇప్పటి నించి అంత చెయ్యి దురుసుతనం మంచిది కాదు' అని ఆ పిల్లని నేను నెత్తిమీద మొట్టి వాళ్ల నాన్నకి వినిపించేలా అరిచాను. అతనితో ఎలాగైనా గొడవ పడాలి.

సుమ ఏడుపు లంకించుకుంది.

ఇంతలో వాళ్ల నాన్న బయటకు వచ్చాడు.

'ఎందు కేడుస్తున్నావ్?' అతనడిగాడు.

'బావ కొట్టాడు.' నా కేసి చెయ్యి చూపి అంది సుమ.

మా కుట్టి నన్ను బావ అని పిలుస్తుంది కాబట్టి మా బిల్డింగులో అందరికీ నేను బావ నయ్యాను. భాష వేరు కావటంతో అందరూ అలాగే పిలుస్తారు.

'చిన్న పిల్లల ఆటలో మీరు కలగ చేసుకోవటం అనవసరం.' నన్ను చూస్తూ అతను కోపంగా అన్నాడు.

'ఆడుకున్నంతసేపూ కలగజేసుకోవటం అనవసరం. కాని, కొట్లాటకు దిగితే మందలించటం మన విధి.' కొంచెం కటువుగా అన్నాను. చెప్పానుగా-అతనంటే నాకు మంట?

'మీ నోరు మందలింపులతో తృప్తి పడదులా ఉంది. చెయ్యెందుకు చేసు కున్నారు?'

'ఆటలో దవడ పేలేలా మా కుట్టిని కొట్టినందుకు.'

'మా సుమతో ఆడటం ఇష్టం లేకపోతే మీ కుట్టిని ఇంట్లో పెట్టి తాళం వెయ్యండి.'

'ఆ అవసరం నాకు లేదు. మీ సుమనే ఘోషాలో పెట్టి మూ తెయ్యండి. లేకపోతే ఆట సరిగా ఎలా ఆడాలో ఇంటి దగ్గర రిహార్సల్స్ వేయించి పంపండి.'

'పట్టింది. నా పిల్లలని ఊరివాళ్ల పిల్లల గురించి దాయవలసిన అవసరం లేదు.'

'ఎవడి కుందయ్యా అవసరం— మా కుందా?' కొంచెంకంఠం పెంచి ఏకవచనపు గౌరవ వాచకంలోకి దిగాను.

'డి దేర్. యువార్ క్రాసింగ్ ది లిమిట్స్.' అతను ఇంగ్లీషులో హెచ్చరించాడు.

ఏకవచనమా? బహువచనమా? నిర్ణయించలేం. కోపంలో ఉన్నాడు కాబట్టి ఏకవచనమే అయి ఉంటుంది. మనం నేర్చిన ఇంగ్లీషు—'సారీ, ఎక్స్క్యూస్, థాంక్స్, ప్లీజ్' లాంటి పెదవుల మీది ఆడంబరపుటాచారాలకు, తిట్టుకోవటానికి బాగా ఉపయోగపడుతుంది. నే నెందు లోనూ తీసిపోను.

'నాతో అనవసరంగా మాట్లాడకు. పిల్లలని క్రమశిక్షణలో ఎలా పెంచాలో తెలియని నువ్వు నాకు సలహాలు ఇవ్వ నవసరం లేదు.'

'నువ్వు వాడేస్తున్నావు పెద్దమాటలు. పిల్లలని పెంచటం రోడ్డుమీద పోయే ఆడపిల్లలమీద కామెంట్లు పాస్ చేసే లాంటి అతి తేలికైన విషయం లాంటిది కాదని మాత్రం గుర్తు పెట్టుకో.'

ఈ సంభాషణ ఇంగ్లీషులో సాగింది. అతను నా 'టీనేజ్‌నేచర్'ను దెప్పి పొడుస్తున్నాడు. నాలోని 'రెబెల్' మేల్కొంది.

'అలాగటండీ! ఇప్పుడర్థమైందిలెండి. అవునూ— ఈ మధ్య మీ ఆఫీసులో పనిచేసే నిర్మలాదేవిగారు మీతో మానేశా రెందుచేతట తిరగటం?' వెటకారంగా వచ్చి తెలుగులో అన్నాను.

నిర్మల అనే ఆవిడా, ఈయనా కొంచెం చనువుగా ఉండేవారని, ఆ చనువు పురస్కరించుకుని ఈయన ఓ శుభసమయంలో చీకటిపడ్డ తరవాత పార్కులో ఆవిడ చెయ్యి గుండెల కద్దుకుని "నిర్మా! నువ్వు నా కలల పంటవి. నా హృదయరాణివి. నే కలలు గన్న కళ్యాణివి. నువ్వు లేకపోతే నేను నీరులేని చెరువులో చేపను. గట్టుమీద గిలగిల లాడే ఇంకో రకం చేపని. నువ్వు లేకపోతే అన్నీ ఉన్నా ఏమీ లేని వాణ్ణి. నమ్మ్మ. ఇది నిజం" అని సినిమా డైలాగులు అప్పజెప్పబోయేసరికల్లా, ఆవిడ హస్త ముద్ర ధారణ చేసిందని ఆ మధ్య గొప్ప గుసగుసలు బయలుదేరినాయి. ఆవిడ వీణ్ణి సత్కరించినందుకు నేను సంతోషించాను. భూమిమీద ఓ మంచిపని జరిగిందనుకున్నాను. ఆవిడది అజంతా అందం. వీడిది కోతిముఖం—నా అసూయకి కారణం — వాళ్లిద్దరూ చనువుగా తిరగటమే. అప్పుడే అనుకున్నాను— ఎప్పుడో అప్పుడు దీనికి వీడు ప్రతిఫలం అనుభవిస్తాడని. నా శాపం ఫలించింది.

నిర్మల సంగతి ఎత్తేసరికల్లా అతను ఏం మాట్లాడలేకపోయాడు. వాళ్ల కూతుర్ని తీసుకుని గబగబా ఇంట్లోకి వెళ్లిపోయి భళ్లున తలు పేసేకున్నాడు. నేను అంతకంటే రుసరుసలాడుతూ మా కుట్టీ చెయ్యి పట్టుకుని మరింత గట్టిగా వినిపించేలా ఫెళ్లున తలుపేసి లోపలి కెళ్లిపోయాను.

జరుగుతున్న 'స్పెషల్ షో' అయిపోవటంతో పిల్లలంతా ఆటలో మునిగి పోయారు.

* * *

రెండు రోజులు మామూలుగానే గడిచాయి.

ఈ రెండు రోజుల్లో నేను అతనితో మాట్లాడలేదు. అతని నీడ కనిపిస్తే తలుపులు మయ్యటమో, అతని అలికిడైతే మొహం తిప్పుకోవటమో, పిలుస్తున్నప్పుడల్లా దెప్పిపొడవటమో చేసేవాడిని. అతనుకూడా అలాగే ప్రవర్తించేవాడు. పెద్దవాళ్లం మాట్లాడుకోవటం మానేశాంగాని సుమ, కుట్టీ మాట్లాడుకోవాలని తహతహలాడిపోతున్నారు. కాని, మే మిద్దరం వాళ్లని ఇల్లు కదలనివ్వకుండా చేశాం.

మా కుట్టీలో పూర్వపు చలాకీతనం ఉడిగిపోయింది. దిగాలుగా కుర్చీలోనే కూర్చుని కిటికీలోంచి వాళ్ల వాటాకేసి చూస్తూండేది—ఒకటి రెండు సార్లు సుమ గట్టిగా ఏడవటం, వెంటనే వీపు మీద బాదిన శబ్దాలు నాకు వినిపించటంతో కుట్టీతో కలిసి ఆడుకునేందుకు చేసిన నేరానికి ఫలితంగా అతను సుమని కొడుతున్నాడని నేను ఊహించుకో గలిగాను. మూడో రోజున కుట్టీ సరిగా భోజనం చెయ్యలేదు. ప్రతి చిన్న విషయానికీ విసుక్కోవటం, చిరాకు పడటం మొదలుపెట్టింది. కారణం నాకు తెలిసినా, నేను మౌనంగా ఉండిపోయాను.

ఆక్టివ్‌గా ఉండే శూర్పణఖ తెర మీద లేకపోయేసరికి మిగతా పిల్లలు గుంపు చెదిరిన పక్షుల్లా అల్లాడిపోయారు. వారం రోజులు గడిచేసరికల్లా పిల్లల ఆటలు బందయ్యాయి. మా బిల్డింగంతా అతి ప్రశాంతంగా ఉంది. ఈ ప్రశాంతత మొదటి రోజు బాగానే ఉంది కాని, రెండో రోజునుంచి ఏదో వెలితి ఫీలవటం మొదలుపెట్టాను. పిల్లలు అల్లరి చేసేటప్పుడు ఉండే ప్రశాంతత కంటే, పిల్లలు అల్లరి చెయ్యనప్పుడు ఉండే ప్రశాంతత మరింత అశాంతిని పెంచుతుందే కాని, నిజమైన ప్రశాంతిని ఇవ్వలేక పోతుంది. మేమందరం వాళ్ల కేకలకి, అల్లరికి, ఆటలకి, గారాలకి అలవాటుపడి బ్రతుకుతున్నాం. ఆ అల్లరి, అరుపులు లేకపోతే చాలా చిరాగ్గా ఉంటూంది. ఇది నా 'పెర్సనల్ ఫీలింగ్' మాత్రమేనని నేను గట్టి అభిప్రాయంతో స్థిరంగా నిలిచేవాడినే గాని, మా ఇంటి పక్కాయన ( అంటే సుమ తండ్రి కాదుసుమండీ! మొండిముండావాడా— అంత తేలిగ్గా మాట్లాడుతాడా— గాడిదబుద్ధులు! )— 'ఏమిటండీ? మన బిల్డింగులో ఏదో మారింది, ఏదో వెలితిగా ఉందండి' అని అనటంతో, అది మా బిల్డింగ్ కమ్యూనల్ ఫీలింగని నేను అనుకున్నాను.

సాయంకాలం ఈ ప్రశాంత వాతావరణంలో బ్రతకలేక డీలా పడిపోయిన కుట్టీని తీసుకుని దగ్గర్లో ఉన్న చెరువు దగ్గరికి షికారు బయలు దేరాను. చాలా హుషారుగా బయలు దేరింది కుట్టి. అంత సంతోషమెందుకో నా కర్థం కాలేదు. తీరా చెరువు దగ్గరి కెళ్లేసరికల్లా బోధపడింది. అక్కడ గట్టు మీద సుమ, సుమ తండ్రి కూర్చుని ఉన్నారు. నేను కుట్టీని తీసుకుని గబగబా దూరంగా వెళ్లి కూర్చున్నాను. వెంటనే కుట్టి గట్టిగా మాట్లాడటం మొదలు పెట్టింది— సుమకి వినపడేంత గట్టిగా.

'నేను ఈవేళ భోజనం చెయ్య లేదు కదూ, బావా?'

'ఎవరూ తినద్దనలేదుగా!'

'నువ్వు నీలంరంగు పెన్సిలు తెచ్చావు కదూ, నాన్నా! చాలా బాగుంది.' అవతలి మంచి సుమ అరుస్తూంది.

నీలంరంగు అంటే మా కుట్టీకి ప్రాణం.

వాళ్ళు ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడు కోవాలని తహతహలాడుతున్నారు. వాళ్లని బిరి గీసి పరిధిలో పెట్టటం అమానుషం. నేను వాళ్ల ఆత్రతని అణగదొక్క దలుచుకోలేదు. నేనూ ఏమీ అనక పోవటంతో కుట్టి కొంచెం ధైర్యం చేసి సుమ కూర్చున్న వైపు చెయ్యి చూపిస్తూ అంది: 'ఆ తామరపువ్వు చాలా బాగుంది కదూ, బావా?'

'అవును.'

'మరి కోద్దామా?'

'వద్దు.'

'ఏం, బావా?'

'వద్దన్నా నంతే!'

ఒక్క నిమిషం గడిచాక దబ్‌మని శబ్దం వినిపించింది. నేను తల తిప్పి అటు చూశాను. కుట్టి కిష్టమైన తామర పువ్వు కొయ్యటానికి సుమ నీళ్లలోకి దూకింది. ఈ హఠాత్పరిణామానికి సుమ తండ్రి విస్తుపోయి కూర్చున్న చోటు నుంచి గబుక్కున లేచి నిలబడి నీటిలోకి చూస్తున్నాడు. నేను అవతలి గట్టుకు పరుగెట్టాను. నా కంటే ముందే కుట్టీ ఉడాయించింది. నా చెయ్యి పట్టుకుని భయంగా నీళ్లలోకి తొంగి చూస్తూంది.

అతనికి ఈత రాదు. నాకు ఈత వచ్చుననే విషయం అతనికి బాగా తెలుసు. నేను గట్టుమీద నించుని చూస్తున్నాను. సుమ తామరపువ్వు పీకి శక్తికొద్దీ మా వేపుగా విసిరి,బుడుంగున మునిగిపోయింది. ఎర్రతామర నీళ్లలో తేలుతూంది. నీటి ఉపరితలంమీద బుడగలు తెరలు తెరలుగా వస్తున్నాయి. సుమ సహాయం కోసం చేతిని పైకి కనిపించేలా విసురుతూంది. నీళ్ల కెలకెలలుబట్టీ సుమ నీళ్లు మింగి లోపల గిజగిజలాడుతూందని నాకు స్పష్టంగా తెలుస్తూంది.


'నీళ్లలో దిగి సుమని పైకి తియ్యి, బావా!' కుట్టి కంగారుగా అంటూంది.

నేను అతని కేసి చూశాను. నా సహాయం అడుగుతాడేమోనని అనుకున్నాను. కాని, అతను పెదవి విప్పటం లేదు. మాట్లాడటానికి అంత పౌరుషం అయితే నా కేం పట్టింది.? 'యు వార్ క్రాసింగ్ ది లిమిట్స్' అని అంటాడా? తగిన శాస్తి జరుగుతూంది.

నా చెయ్యి పట్టుకున్న కుట్టి గబుక్కున నా చెయ్యి వదిలి సుమ తండ్రి దగ్గరికి వెళ్లి ఆయన చెయ్యి కదుపుతూ-'బావకు ఈత వచ్చు. సుమని తియ్యమని చెప్పండి' అని అంది.

అతను ఓసారి నా వంక చూసి తలదించుకున్నాడు.

ఈసారి తప్పకుండా అతను నాతో మాట్లాడుతా డనుకున్న నాకు ఆశాభంగం కలిగింది. దానితో అతనిమీద కోపం ఎక్కువైపోయింది.



నీటి ఉపరితలంలో బుడగలు మరింత వేగాన్ని పుంజుకుని పెద్దవిగా వెలువడుతున్నాయి. ఊపిరాడక సుమ గిలగిల కొట్టుకుంటూంది. నీటి అలలు గట్టు చివరిదాకా ప్రయాణించి దబ్‌మని శబ్దం చేస్తున్నాయి. చెరువంతా కల్లోలపూరితంగా ఉంది. ఆ అలల మధ్య చేతి వేళ్ళు, తేలే వెంట్రుకలు పరుచుకుని కనిపిస్తున్నాయి.

మా ఇద్దరినీ చూసింది కుట్టి. ఒకసారి అటునుంచి ఇటు మా మధ్యగా పరుగెత్తి మధ్యలో నించుంది.

నేను వెనక్కి తిరిగి రోడ్డు కేసి నడవబోయాను.

నించున్న కుట్టి దబ్బున నీళ్లలోకి దూకింది.

నేను తెల్లబోయాను!

ఆలోచించేందుకు వ్యవధి లేదు. వేగంగా షర్టు గట్టుమీద పారేసి నీళ్లలోకి దూకాను.

కుట్టి నీళ్లలోకి దూకుతూనే 'అమ్మా' అని అరిచిన అరుపు, నేను నీళ్లలో దూకిన శబ్దంతో కలిసి పరిసరాలు మారుమోగాయి.

రెండు నిమిషాల్లో పూర్తిగా మునిగిన సుమని వీపున, మరో చేత్తో కుట్టిని ఒడ్డుకు లాక్కొచ్చాను. అతను మాట్లాడకుండా సుమని అందుకుని గట్టుమీద పడుకోబెట్టి పొట్టమీద చేతు లాన్ని, నీళ్ళు కక్కిస్తున్నాడు.

కుట్టిని గట్టుమీద కూచోపెట్టాను. బాధగా మూలిగి నేలమీద కొరిగిపోయింది కుట్టి. నా గుండెలు దడదడ లాడాయి. కుట్టి మొహం అటునుంచి ఇటు తిప్పాను. నీరసంగా తల వాలిపోతూంది.

భుజంమీద కుట్టిని ఎత్తుకుని హాస్పిటలువైపు నడిచాను.

వెనకగా స్పృహలో కొచ్చిన సుమని నడిపించుకుని అతను వస్తున్నాడు.

* * *

'కాలు విరిగింది మీ కుట్టికి.' డాక్టర్ అన్న మాటలతో నా మనస్సు కలుక్కుమంది.

"భగవాన్! ఎందుకీ శిక్ష? పసిపాప మీదా నీ నిర్దయ! నా కాలు విరిగితే నేను బాధపడను గాని, మంచి మనస్సుకు లేత వయస్సులో ఎందుకీ ఆఘాతం? కొంపతీసి శాశ్వతంగా కుంటిదై పోతే ఇంకేమైనా ఉందా?" ఆ చెడు తలపుతోనే గుండెలు గుబుగుబలాడాయి.

'డాక్టర్! కాలు త్వరలోనే వస్తుంది కదూ?' భయంగా అడిగాను.

'దేవుడా! మా కుట్టికి అన్యాయం చెయ్యకు.' డాక్టర్ జవాబు చెప్పేలోగా వెయ్యి సార్లు దేవుడికి దండం పెట్టుకున్నాను.

'ఏం ఫరవాలేదు. సిమ్మెంటు కట్టు కట్టాను. సింపుల్ ఫ్రాక్చర్. మీరు కుట్టిని చూడవచ్చు. లోతు తక్కువగా ఉన్న నీళ్లలో వేగంగా దూకటంవల్ల ఇది జరిగింది. దట్సాల్.' డాక్టర్ వెళ్లిపోయాడు.

నేను ఆత్రంగా లోపలికెళ్లాను. కుట్టి తెల్లటి బెడ్‌మీద కాళ్లు పరుచుకుని కూర్చుంది. పెదవులమీద తృప్తితో పాటు చిరునవ్వు మెరుస్తూంది. కళ్లలో విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. ఎడం కాలికి సిమ్మెంటు కట్టు.

నేను కుట్టిని సమీపించాను. క్షణం పోయిన తరవాత అడిగాను:

'కుట్టీ, నీళ్లలోకి ఎందుకు దూకావు?'

'మరి సుమ మునిగిపోతోందిగా? అందుకు.'

'మునిగిపోతే నీ కేం? నిన్ను ఎండ నాటలో కొట్టిందిగా?'

'కొడితే ఏం, బావా? మినపసున్ను పెట్టిందిగా? అయినా, ఒక్కసారేగా కొట్టింది. నేను అప్పుడైతే కొట్టేదా మరి?'

'అయితే, సుమంటే నీకు కోపం లేదూ?'

'ఊఁ హూఁ.' తల అడ్డంగా తిప్పి అంది.

'మరి కొడితే ఎందు కేడిచావు?'

'ఎందుకేమిటి? కొట్టిందిగా? అందుకు.'

'మరి మళ్లా మాట్లాడాలని ఎందు కనుకున్నావు?'

'ఎందుకేమిటి? మాట్లాడాలి. అంతే. నీ కన్నీ సందేహాలే, బావా! నే నొకటి అడుగుతాను చెప్పు. సుమ నీళ్లలోకి ఎందుకు దూకింది? నాకు తామరపువ్వు కోసిద్దామనే కదూ? మరి అది మునిగి పోతూంటే చూస్తూ ఎలా ఊరుకోను?'

'మరి వాళ్ల నాన్న చూస్తూ గట్టున నిలబడిపోయాడుగా?'

'ఆయనకి ఈత రాదుగా? అందుకని నిలబడిపోయాడు.'

'నీకూ రాదుగా? నువ్వు ఎందుకు నిలబడిపోలేదు?'

'రాకపోతేనేం! అది మునిగిపోతోంది. కాస్సేపాగితే చచ్చిపోతుంది. చూస్తూ ఎలా ఊరుకోవటం? ఆ సమయంలో నాకు ఈత రాదని మరిచిపోయాను. దూకేశాను. ఏం, బావా? తప్పు చేశానా?' అతి అమాయకంగా అడిగింది కుట్టి.

"తప్పు చేయటమా? లేదు, కుట్టీ, లేదు. నిసలైన మానవుడులా ప్రవర్తించావు నువ్వు. దేవుడూ! నువ్వున్నావు. తప్పకుండా ఉన్నావు. నాకు కనిపిస్తున్నావు. అదుగో. . . అదుగో. . . ఆ కుట్టి అమాయకపు మొహం అంతటా నువ్వే. ఆ పెదవుల చిరునవ్వులో నువ్వే. అదిగో, ఆమె చేసిన త్యాగంలో నువ్వు. నిష్కల్మషమైన వాళ్ల స్నేహంలో నువ్వు. ఇప్పుడు నువ్వు నా కన్నిచోట్లా కనిపిస్తున్నావు. ఆ బెడ్‌మీద ఉన్నది మా మూడో క్లాసు అనర్సు కుట్టి కాదు. నువ్వు. సాక్షాత్తూ నువ్వే భగవంతుడివి.'' నేను అనుకున్నాను. కాదు, ఈ మాటలు నా అంతరాంతరాలలో, అణువుల చివరి అంచుల్లో మార్మోగిపోతున్నాయి!

కుట్టి మొహం కాంతితో వెలిగిపోతూంది. ఆ వెలుగును నేను చూడలేను. తేరిపారచూస్తే గుడ్డివాడినై పోతాను. తల దించుకున్నాను.

చిన్నపిల్లల స్నేహం స్వార్థరహితమైంది. వాళ్ళ పోట్లాటలు జరిగిన కారణాలు గుర్తుపెట్టుకుంటారు గాని, ఆ కారణాలు పట్టుకుని పెద్దల మాదిరిగా పోట్లేళ్లలా పోట్లాడుకోరు. వాళ్లు మూర్తీభవించిన మానవులు. దైవాంశ సంభూతులు. ఇంచుమించు దేవుళ్ళు.

నేను చేసిం దేమిటి? చావు బ్రతుకుల మధ్య ఊపిరి సలపక ఉయ్యాల లూగే ఓ పసిపాపని రక్షించగలిగే శక్తి ఉండీ, అతను పెదవి విప్పలేదని ఆమెను నీళ్లపాలు చేయబోయాను. ఇది హత్య! హత్యకంటే గొప్పది. కుట్టి ఆ సమయంలో నీళ్లలో దూకకపోతే ఏమైపోయేది? ఓ పండవలసిన పిందె ఎండుటాకులా రాలిపోయేది కదూ?

ఆ మానవుడు చేసిన పనేమిటి? కన్నబిడ్డ ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని తెలిసీ పనికిమాలిన అభిమానంతో, పట్టుదలతో మూర్ఖంగా ప్రవర్తించాడే! ఏమిటిది? మేము ఏ యుగానికి చెందిన మనుషులం? మేము సాధించిన నాగరికత ఏమిటి? వేషం, భాష, భేజసం—ఇవేనా ఇరవయ్యో శతాబ్దపు నాగరికత? ఇది ఫాషన్లలో రాకెటుయుగమూ, ప్రవర్తనలలో రాతియుగమూ? మేము మనుషులమా? యంత్రాలమా? ఛీ ఛీ, నా దేం బ్రతుకు! పిల్లల కున్నంత ఇంగితజ్ఞానం, ప్రేమ, అభిమానంకూడా నాలో కరువయ్యాయా? ఆలోచించిన కొద్దీ నేను నా ప్రవర్తనకి సిగ్గుపడటం మొదలుపెట్టాను.

ఇంతలో అలికిడైన శబ్దం విని తల పైకెత్తాను.

ఎదురుగా సుమ, సుమ తండ్రి! సుమ చేతుల్లో నీలంరంగు పెన్సిలుంది.

సుమ పరుగెత్తి కుట్టి మంచం చేరుకుంది.

'కుట్టీ! మరేమో నీ కిష్టమని నీలంరంగు పెన్సిలు తెచ్చాను. అచ్చంగా నీకే. తీసుకో. ఇంక అడగనే అడగను.' కుట్టి చేతుల్లో పెట్టిందా పెన్సిలు సుమ. కుట్టి ఆప్యాయంగా దాన్ని తీసుకుంది.

'నేను నిన్ను ఎండనాటలో కొట్టి నందుకు కోపం వచ్చిందా? మరేమో ఏడు పాగక కొట్టానే. ఇంకెప్పుడూ కొట్టను. నిజంగా.' మళ్లీ సుమే అంది.

'ఊహూఁ! అప్పుడు కోపం రాలేదు కాని, మళ్లా మా ఇంటికి రానందుకు చాలా కోపం వచ్చింది. ఇంకెప్పుడూ నాతో మాట్లాడటం మానేయకేం?' కుట్టి అంది.

వాళ్ల అమాయకత్వానికి, స్నేహపు తియ్యందనానికి నేను కదిలిపోయాను. ముందు అతన్ని క్షమించమని అర్థించాలి. అతని కేసి కదిలాను.

'క్షమించండి. చాలా మూర్ఖంగా ప్రవర్తించాను. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో నాకు తెలియటం లేదు. మా సుమని మాకు దక్కించారు. నా ప్రవర్తనకి నేను సిగ్గు పడుతున్నాను.'

### శిక్ష

మనిషికి పరమ శత్రువులు అతని నేరాలు, అవి నీడల్లా వెన్నంటే తరుము కొస్తాయి. తను తీసుకున్న గోతిలో అతను పడేవరకు ఆ భయంకర చ్ఛాయలు వదలి పెట్టవు.

—క్రెయాన్

అతను నేను మాట్లాడేలోగా అచ్చ తెలుగులో అన్నాడు. ఆ మాటల్లో నాగరికత నేర్పిన 'ఎక్స్యూస్, సారీ, థాంక్స్ లాంటి' తేలిక చిలక పలుకులు లేవు. అవి పెదవుల మీంచి వచ్చినవి కావు. హృదయపు లోతుల్లోంచి వెలికురికిన మానవత్వపు పలుకులు.

'నేను లోపల అనుకుంటున్నదే మీరు పైకన్నారు. చిన్నపిల్లల ఆటల్లో కల్పించుకుని మూర్ఖంగా గొడవలు పెంచుకోవటం పెద్దవాళ్ళు చేసే పొరపాటు. వాళ్ళు ఈ నిమిషంలో జరిగినవి వెంటనే మరిచిపోయి మరో నిమిషంలో ఆనందంలో కలిసిపోతారు. అవి పట్టుకుని మనం వేళ్లాడుతాం.' నే నన్నాను.

'అవును.' అతను ఏకీభవించాడు.

దూరంగా మా బిల్డింగు దగ్గర మంచి ఎల్—ఒ—ఎన్—డి—ఒ—ఎన్ అని పిల్లల అరుపులు వినిపిస్తున్నాయి. అంటే, మేము అలవాటుపడ్డ ప్రశాంత వాతావరణం నెలకొల్పబడుతూందన్న మాట. శుభం! ★